క్లుప్తంగా

22న శ్రీరాముని శోభాయాత్ర



మాట్లాడుతున్న దేవస్థానం సభ్యులు

పొదలకూరు : ఈనెల 22న ఉదయం 9 గంటలకు పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర జరుగుతుందని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవస్థానం కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పెద్ద ఎత్తున శోభాయాత్రను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని రామనగర్ గేటు సెంటర్ నుంచి రామ మందిరం మీదుగా వెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో దేవస్థానం కమిటీ బాధ్యులు దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల క్రికెట్ పోటీల విజేత కోవూరు



విజేతలతో ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు: కోవూరులోని కొత్తూరులో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం జరిగిన క్రికెట్ ఫైనల్స్‌లో కోవూరు సచివాలయం-2 జట్టు విజేతగా నిలిచింది. దీంతో ఎంపీడీఓ శ్రీహరి, ఎంఈఓ రహీమ్ జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు మధుసూదన్‌రావు, రమేష్‌బాబు, పీఈటీలు అజయ్, జాన్సన్ పాల్గొన్నారు.

పేట్రేగిన గొలుసు దొంగలు

నెల్లూరు(క్రైమ్): నగరంలో గొలుసు దొంగలు పేట్రేగిపోయారు. ఒకే రోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో గంట వ్యవధిలోనే మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్లారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గొలుసు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

- బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలు తెంపుకెళ్లారు. వివరాలు.. సరస్వతినగర్‌లో రమణమ్మ తన కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆమె తన ఇంటిముందు నిలబడి ఉండగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చారు. అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఈ మేరకు బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సరోజనమ్మ, వెంకటరత్నం దంపతులు. వారికి ఇద్దరు పిల్లలు. సరోజనమ్మ ఇంటి వద్దనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఆమె దుకాణంలో ఉండగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చారు. వాటర్‌బాటిల్ తీసుకుని డబ్బులు ఇస్తున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నాగేంద్రనగర్‌లో రామచంద్ర, అంజలిదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. రామచంద్ర నగరంలోని కాకర్లవారివీధిలో కుదువషాపు నిర్వహిస్తున్నారు. వారికి కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న రాత్రి ఎదురింట్లోకి ఆడుకునేందుకు వెళ్లిన కుమారుడ్ని తీసుకొచ్చేందుకు అంజలిదేవి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో మొహానికి మాస్కులు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీపుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లున్న పాత నేరస్థులను సైతం విచారిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలోని దొడ్ల డెయిరీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన కళ్యాణ్ కుమార్ (32) చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు నెల్లూరు రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు. ఈ నెల 15న దొడ్ల డెయిరీలో బాయిలర్ ట్యాంక్‌లోని నీరు పడడంతో కళ్యాణ్‌కుమార్‌తో పాటు మరి కొందరు గాయపడ్డారు. కల్యాణ్‌కుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వ్యక్తులకు చిన్నపాటి గాయాలు కావడంతో కోలుకున్నారని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న వేద పండితులు



శివలింగానికి మహా రుద్రాభిషేకం



పూజలో పాల్గొన్న మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రసన్న, విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురళీధర్

ఆద్యంతం శివోహం



మంత్రి కాకాణికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ప్రసన్న

- నార్తురాజుపాళెంలో భక్తజన కోలాహలం
- విజయవంతంగా సాగిన పాదరస లింగేశ్వర మహారుద్రాభిషేకం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని నార్తురాజుపాళెంలో శనివారం తలపెట్టిన పాదరస లింగేశ్వర మహారుద్రాభిషేకానికి జిల్లా నలుమూలల నుంచి భక్తజనం భారీగా తరలివచ్చారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహారుద్రాభిషేకం ఆద్యంతం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు తన్మయంతో కొబ్బరికాయలు కొట్టి శివనామాన్ని జపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – సాక్షి నెట్‌వర్క్









వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

- మహా రుద్రాభిషేకానికి వచ్చిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కాలచక్ర డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు: పార్టీలన్నీ ఏకమై ఎన్ని పన్నాగాలు పన్నినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నార్తురాజుపాళెంలోని మహా రుద్రాభిషేకం వేదికపై కాలచక్ర డైరీని శనివారం ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుష్టశక్తుల నుంచి జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎంను చేయాలని ఈ మహా రుద్రాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కాలచక్ర డైరీలో రాసుకున్నవన్నీ జరుగుతూనే వస్తున్నాయని, జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి విజయాన్ని కూడా కాలచక్ర డైరీలో రాయబడిందన్నారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్, డీఏఏబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ జి.విజయకుమార్, ఆప్కాఫ్ చైర్మన్ కె.అనిల్‌బాబు, సీనియర్ నేతలు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.సుప్రజ, మండల కన్వీనర్‌లు జి.వెంకటశేషయ్య, జి.వెంకటశేషయ్య, ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, సీహెచ్.సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కె.శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఉప సర్పంచ్ కళ్యాణి, నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, అడపాల మోహనకృష్ణ, ఎం.రంగారెడ్డి, ఆర్.రాజేష్ రెడ్డి, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు అయోధ్య అక్షతలు



అక్షతలను తీసుకెళ్తున్న భజన బృందం

మనుబోలు : అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాముని అక్షతలను మండలంలో గడప గడపకు పంపిణీ చేస్తున్నామని సమరత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో రామాలయ అర్చకుడు పృథ్వీ రమణమూర్తి భజన బృందంతో కలిసి శనివారం గ్రామంలో అక్షతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తోందన్నారు. అక్షతలతో పాటు ఆలయ ఫొటోతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండలంలో మొత్తం 8 వేల కుటుంబాలకు అక్షతలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భజన బృందం సభ్యులు చప్పరం లక్ష్మీనారాయణ, సుధాకర్, బి.వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై పరిశీలన



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో నకిలీ వరి విత్తనాల కారణంగా ముందుగానే వెన్ను తీసిన వరిపైర్లను వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. నకిలీ విత్తనాల కారణంగా చెర్లోపల్లిలో సుమారు 200 ఎకరాల్లో వరిపైరు ముందుగానే వెన్ను తీయడంతో బాధిత రైతులు తాము మోసపోయామని గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ డీడీఏ శివనారాయణ, ఏడీఏ శివనాయక్, నెల్లూరు కేవీకే శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, కిరణ్ తదితరులు వరిపైరును పరిశీలించి బాధిత రైతులతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ నెల్లూరులోని కావేరి సీడ్స్ దుకాణం నుంచి బీపీటీ 5204 రకం విత్తనాలను తెచ్చి వరినాట్లు వేసినట్లు రైతులు తెలిపారన్నారు. అయితే 70 రోజులకు రావాల్సిన వెన్ను 50 రోజులకే వచ్చినట్లుగా రైతులు చెబుతున్నారని, పైరు ముందుగానే వెన్ను తీయడం వెనుక కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, ఏఈఓ కళారాణి, వీఏఏ శిరీష, వీఆర్వో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఎంపీడీఓ తనిఖీ



వృద్ధులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పార్వతి వృద్ధుల ఆశ్రమాన్ని ఎంపీడీఓ శ్రీహరి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులతో మాట్లాడారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ ఆరాతీశారు. ఆశ్రమంలో 27 మంది వృద్ధులు ఉంటున్నారని నిర్వాహకులు తెలిపారు. అందరికీ పింఛన్ వస్తుందా అని అడగ్గా, ఒకరికి రావడం లేదని వారు తెలిపారు. దీంతో సదరు వృద్ధుని వివరాలు నమోదు చేసుకుని త్వరలో పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మండలంలో మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారన్నారు. 4.30 గంటలకు మాచర్లవారిపాళెం పంచాయతీలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : రోడ్డు దాటుతుండగా మోటారు బైక్ ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ పవన్ కాలనీ సమీపంలో శనివారం జరిగింది. బుజబుజనెల్లూరులో నివాసం ఉంటున్న షేక్.మున్వర్ పనినిమిత్తం పవన్ కాలనీ వద్దకు వచ్చాడు. తిరిగి బుజబుజనెల్లూరుకు వెళ్తుండగా, వెనుక నుంచి బైక్ మున్వర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రథం తయారీకి రూ.50 వేల విరాళం



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రథం తయారీకి పట్టణానికి చెందిన రావూరు శేషయ్యనాయుడు కుమారులు సుధీర్, సుమంత్ రూ.50 వేల నగదు విరాళాన్ని దేవస్థానం కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి శనివారం అందజేశారు. రూ.కోటి వ్యయంతో రూపొందిస్తున్న రథం తయారీకి భక్తులు అధిక సంఖ్యలో విరాళాలు అందజేసి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఎం.శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం



రామాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో.. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం అంతే నిజమని రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లూరు పంచాయతీ రామాపురంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో మంత్రి శనివారం పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకోవడం వల్ల వందిమాగధులతో గుంపుగా ఎన్నికల బరిలోకి వస్తున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ పాడె మీద ఉందని వ్యంగ్యంగా అన్నారు. ఈ పాడెను మోసేందుకు చంద్రబాబు, అచ్చెన్నాయుడు, లోకేశ్‌లు ఉండగా నాలుగో వ్యక్తిగా సినీనటుడు పవన్‌కల్యాణ్ వచ్చి కలిశారని విమర్శించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదైతే ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు.

వల్లూరు అభివృద్ధికి 28.30 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వల్లూరు పంచాయతీలో అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాల పంపిణీకి రూ.28.30 కోట్ల వ్యయం అయ్యిందని మంత్రి కాకాణి అన్నారు. ఇందులో భాగంగా రామాపురంలో నూతన సచివాలయ భవనం, సైడు డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, పార్టీ నేతలు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి, కందలూరు వెంకట్రామరెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్ పల్లికొండ పెంచల ప్రతాప్, స్థల దాత పేర్నేటి విజయభాస్కర్‌రెడ్డి బంధువులు, అంకుపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన వలంటీర్లకు మంత్రి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వివిధ గడ్డిమందుల వల్లే ఎదుగుదల లేమి



వరి పంటను పరిశీలిస్తున్న డీడీఏ తదితరులు

- డీడీఏ శివనారాయణ

కొడవలూరు : రెండు లేదా మూడు రకాల గడ్డి మందులు వాడడం వల్లే వరి పంటలో ఎదుగుదల లేమి కనిపిస్తోందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివనారాయణ స్పష్టం చేశారు. మండలంలోని గండవరం, కొత్తవంగల్లు గ్రామాల్లో శాస్త్రవేత్తలతో కలిసి శనివారం ఆయన పర్యటించి ఆర్ఎన్ఆర్ 15040, కేఎన్ఎం 1638 వరి రకాలను పరిశీలించి ఎదుగుదల క్షీణించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మూడు రకాల గడ్డి మందులు వాడడం వల్ల మొక్కల్లోని ఫైటో టాక్సిన్‌పై ప్రభావం ఉందని తెలిపారు. ఇలా ఉంటే బూస్టర్ డోస్‌గా యూరియాను వేసుకోవడం ద్వారా సమస్యను అధిగమించవచ్చన్నారు. ఆయన వెంట ఏఆర్ఎస్ సైంటిస్ట్ పరమశివ, డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి, ఏఓ శైలజా కుమారి, ఎంఏఓ లక్ష్మి, వీఏఏలు టి.కవిత, సీహెచ్ వంశీకృష్ణ ఉన్నారు.

అక్రమార్జనలో ఆరితేరిన 'సూరా'

- బయటపడిన సూరా శ్రీనివాసులురెడ్డి అవినీతి బాగోతం
- వవ్వేరు బ్యాంకులో రూ.కోట్లాది నిధుల స్వాహా
- పార్టీకి దూరం పెట్టిన ఎమ్మెల్యే ప్రసన్న



సూరా శ్రీనివాసులురెడ్డి

కోవూరు: తియ్యని మాటలు చెబుతాడు. స్నేహానికి నిర్వచనం తానే అన్నట్లుగా నమ్మిస్తాడు. కలిసి వ్యాపారం చేసుకుంటే చేతినిండా డబ్బులు ఉండేలా చేస్తానంటూ నమ్మబలుకుతాడు. అనుకున్నట్లుగా స్నేహితులతో పెట్టుబడులు పెట్టిస్తాడు. ఆపై వ్యాపారాల్లో నష్టం వచ్చిందంటూ పెట్టుబడులు ఇవ్వకపోగా వారిని బెదిరించి సొమ్ము చేసుకుంటాడు. మోసం చేయడంలో ఆరితేరిన ఆ చోటా నేత బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి.

అక్రమంగా మద్యం విక్రయిస్తూ..

బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడుకు చెందిన సూరా శ్రీనివాసులురెడ్డి అక్రమ మద్యం విక్రయాలు చేయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతని అసలు స్వరూపం బయటపడడంతో నష్టపోయిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఆయన గతంలో స్నేహితుల ద్వారా పెట్టుబడి పెట్టించి చిన్నపాటి మోటార్ షోరూమ్‌ను ఓపెన్ చేయించి అందులో వచ్చిన ఆదాయాన్ని స్వాహా చేశాడు. ఆపై వ్యాపారంలో నష్టాలు వచ్చాయని స్నేహితులను మోసం చేశాడు. అంతే కాదు గత టీడీపీ హయాంలో వైన్‌షాపులను దక్కించుకుని అందులోనూ స్నేహితులతో పెట్టుబడులు పెట్టించి నష్టాలు చూపి ఆదాయాలను స్వాహా చేశాడు.

అక్రమార్జనకు వేదికగా వవ్వేరు బ్యాంక్

వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంకును తన అక్రమార్జనకు అడ్డగా మార్చుకున్నాడు. గత టీడీపీ హయాంలోనూ కోట్ల రూపాయలు స్వాహా చేశాడు. అప్పట్లోనే దాదాపు రూ.5 కోట్ల వరకు అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. అప్పటి కలెక్టర్ ముత్యాలరాజు 52 యాక్ట్ ద్వారా పూర్తి విచారణ చేపట్టాలని కమిటీని నియమించారు. దీంతో కోర్టు ద్వారా స్టే తెచ్చుకుని విచారణ నిలుపుదల చేసుకున్నాడు. అనంతరం కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగుల పేరు మీద రూ.3 కోట్ల వరకు రుణాలు తీసుకుని స్వాహా చేశాడని ఆ ఉద్యోగులే వెల్లడించారు. అలాగే బ్యాంకులో దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాల పేరుతో మరో రూ.3 కోట్లు తీసుకుని చెల్లించలేదని తెలుస్తోంది. అదే బ్యాంకులో బంగారం లేకుండానే బంగారు తనఖా పెట్టినట్లు చూపించి రూ.3.44 కోట్ల రుణాలు తీసుకుని చెల్లించలేదు. దీనిపై కూడా జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ తిరుపాల్‌రెడ్డి మరో విచారణకు ఆదేశించారు. 52 యాక్ట్ విచారణపై స్టే ఉన్న కారణంగా 51 యాక్ట్ ప్రకారం విచారణ చేపట్టాలని ఆదేశాలు రావడంతో సూరా శ్రీనివాసులురెడ్డిని చైర్మన్ పదవి నుంచి తొలగించారు.

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలో..

ఇసుక, గ్రావెల్‌ను రైతుల అవసరాల పేరుతో సూరా శ్రీనివాసులురెడ్డి అక్రమంగా రవాణా చేయించాడు. ఇలా అక్రమ రవాణాలో దాదాపు రూ.20 కోట్ల వరకు సంపాదించారని సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూరా శ్రీనివాసులురెడ్డిని వైఎస్సార్‌సీపీ నుంచి దూరం పెట్టారు. ఇప్పటికే చాలా మంది నాయకులు అప్పులిచ్చి తిరిగి తీసుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.